సన్మానం



గోల్కొండ: శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను మాజీ కార్పొరేటర్ మిత్ర కృష్ణ మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన స్పీకర్‌ను శాలువాతో సన్మానించారు. కలిసిన వారిలో అభిషేక్, రామకృష్ణ, ఉమేష్, విజయ్ తదితరులున్నారు.

బేగంబజార్ ఇన్‌స్పెక్టర్‌కు సన్మానం



భరత్‌కుమార్‌గౌడ్‌ను సన్మానిస్తున్న దినేష్‌యాదవ్

అబిడ్స్: బేగంబజార్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన భరత్‌కుమార్ గౌడ్‌ను గోషామహల్ నియోజకవర్గం బీజేపీ సీనియర్ నాయకుడు దినేష్ యాదవ్ మంగళవారం ఘనంగా సన్మానించారు. గత సంవత్సరం నుంచి బేగంబజార్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన విజయ్‌కుమార్ ఎస్సార్‌నగర్ ట్రాఫిక్ పీఎస్‌కు బదిలీ కావడంతో ట్రాఫిక్ అడ్మిన్‌గా ఉన్న భరత్‌కుమార్‌గౌడ్‌ను బేగంబజార్ ఇన్‌స్పెక్టర్‌గా నియమించారు.

చెట్ల పొదల్లో చెలరేగిన మంటలు



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

యాకుత్‌పురా: మదీనానగర్ రైల్వే ట్రాక్ సమీపంలోని చెట్ల పొదల్లో మంగళవారం ఆకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో స్వల్ప అగ్ని ప్రమాదం జరిగింది. గమనించిన స్థానికులు వెంటనే స్పందించి అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న రెయిన్ బజార్ కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్, పోలీసులు అక్కడికి చేరుకొని ప్రమాదంపై స్థానికులతో ఆరా తీసి సిబ్బందికి సహాయమందిచారు. పక్కనే ఉన్న విద్యుత్ స్తంభం, రైల్వే కరెంటు తీగలకు మంటలకు వ్యాపించకుండా సిబ్బంది సకాలంలో మంటలను అదుపు చేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

కార్మికుల సమ్మె నోటీసులు

మణికొండ: కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలనే లక్ష్యంతో ఈనెల 20న నుంచి మున్సిపల్, వైద్య తదితర రంగాల కార్మికులు సమ్మెకు వెళ్తున్నారని, అందుకు అనుగుణంగా ఆయా శాఖల అధికారులకు నోటీసులు అందించామని సీఐటీయూ గండిపేట మండల కన్వీనర్ డి. ప్రవీణ్ అన్నారు. ఆయన ఆధ్వర్యంలో కార్మికులు మంగళవారం నార్సింగి మున్సిపల్ మేనేజర్, మండల వైద్యాధికారులకు నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దశాబ్దాల కాలాల పాటు పోరాటాలు చేసి కార్మికులు సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్స్‌గా తీసుకొచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. అవి అమలు జరిగితే రాబోయే రోజుల్లో కార్మిక సంఘాలు ఏర్పాటు చేసే అవకాశం ఉండదని, కార్మిక శాఖ నిర్వీర్యం అవుతుందన్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రత, ఉపాధి లేకుండా పోతుందన్నారు. లేబర్ కోడ్స్‌ను అమలు చేయొద్దని, కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించాలని, ఆశ వర్కర్లను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు.

ఓ వైపు విస్తరణ.. మరో వైపు మరమ్మతులు

- నిరంతరాయంగా మెట్రో రోడ్డు విస్తరణ
- ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు పనులు
- సీఎం ఆదేశాల మేరకు జోరందుకున్న పనులు
- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సైతం మెట్రో పనుల పరిశీలన



కోట్ల అలీజా చౌరస్తాలో మరమ్మతులు చేయించుకుంటున్న యజమానులు



ఇదే రోడ్డులో మెట్రో రైలు కోసం కొనసాగుతున్న రోడ్డు విస్తరణ పనులు

చార్మినార్: గ్రేటర్‌లోని అన్ని కారిడార్లలో పరుగులు తీసినట్లే.. ఇక నుంచి పాతబస్తీలో కూడా మెట్రో రైలు పరుగులు తీయనుంది. సీఎం ఆదేశాల మేరకు పాతబస్తీలో నిర్మించనున్న మెట్రో కోసం రోడ్డు విస్తరణ పనులు వేగంగా జరుగుతున్నాయి. దారుషిఫా నుంచి మొగల్‌పురా బీబీ బజార్, హరిబౌలి రోడ్డులో విస్తరణ పనులు జోరుగా కొనసాగుతున్నాయి. రోడ్డు విస్తరణలో తమ భవన సముదాయాలను, స్థలాలను కోల్పోతున్న సంబంధిత యజమానులు వెంటనే మిగిలిన దానికి మరమ్మతులు చేయించుకుంటున్నారు. రోడ్డు విస్తరణలో పోయిన దానిని వదిలేసి..మిగిలిన భాగాన్ని తమకు అనుకూలంగా తీర్చిదిద్దుకుంటున్నారు. ముఖ్యంగా రోడ్డుకు ఇరువైపుల కోల్పోయిన మల్గీల స్థానంలో వెనక్కి జరిగి తిరిగి మల్గీలను పునర్ నిరించుకుంటున్నారు. దీంతో గత కొన్ని నెలల క్రితం మొదలైన కూల్చివేతలు ఎలాంటి అడ్డంకులు లేకుండా కొనసాగుతున్నాయి. అంతే వేగంగా భవనాల పునర్ నిర్మాణం పనులు కూడా జరుగుతున్నాయి. ఇక కొత్తగా బాధ్యతలు చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, మున్సిపల్ ముఖ్య కార్యదర్శి ఇలంబర్తి, గ్రేటర్ కమిషనర్ ఆర్.వి.కర్ణన్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి ఇతర అధికారులతో కలిసి ఇటీవల పాతబస్తీలో పర్యటించి ప్రస్తుతం కొనసాగుతున్న మెట్రో రైలు పనులను పరిశీలించారు.

చకచకా కూల్చివేతలు..

హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీతో పాటు మజ్లిస్ పార్టీ ఫ్లోర్ లీడర్ అక్బరుద్దీన్ ఒవైసీలు కూడా పాతబస్తీలో మెట్రో రైలు పనులను వెంటనే చేపట్టాలని కోరడంతో రోడ్డు విస్తరణ పనులు మొదలయ్యాయి. తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే పాతబస్తీలో మెట్రో పనులు ప్రారంభమవుతాయని కాంగ్రెస్ అధిష్టానం హామీ ఇచ్చినట్లుగానే పాతబస్తీ మెట్రో రైలు ఏర్పాటుపై సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా ఉండి వెంటనే పనులను ప్రారంభించాలని మెట్రో ఎండీకి చెప్పడం.. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ జరగడం..నిధులను కేటాయించడం.. శంకుస్థాపన చేయడంతో కూల్చివేతల పనులు చకచకా జరిగిపోతున్నాయి.

ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు..

ఫలక్‌నుమా నుంచి ఎంజీబీఎస్ ద్వారా సికింద్రాబాద్ జేబీఎస్ వరకు ఉండే ఈ మెట్రో కారిడార్ పనుల్లో కేవలం ఫలక్‌నుమా నుంచి ఇమ్లిబన్ వరకు మాత్రమే పనులు ఇంకా ప్రారంభం కాలేదు. అయితే ఇప్పుడు ఫలక్‌నుమా వరకు కాకుండా చాంద్రాయణగుట్ట వరకు మెట్రో కారిడార్‌ను పొడిగించారు సీఎం రేవంత్‌రెడ్డి. ఎట్టకేలకు మీరాలంమండి, దారుషిఫా, ఎతేబార్ చౌక్, శాలిబండ, శంషీర్‌గంజ్ ద్వారా ఫలక్‌నుమా, చాంద్రాయణ గుట్ట వరకు మెట్రో పనులు వేగంగా జరుగనున్నాయి. ఇందులో భాగంగా ప్రస్తుతం దారుషిఫా చౌరస్తా నుంచి పురానీహవేలీ, మీరాలంమండి, కోట్ల అలీజాతో పాటు మొగల్‌పురాలోని బీబీబజార్ చౌరస్తా వరకు రోడ్డుకు ఇరువైపులా వ్యాపార సముదాయాలను తొలగిస్తున్నారు. ఇక్కడి చౌరస్తాలో రోడ్డు విస్తరణ పనులు జోరుగా కొనసాగుతున్నాయి. చాంద్రాయణ గుట్ట నుంచి ఆర్జీఐఏ వరకు మెట్రో కారిడార్ కొనసాగనుంది.

ఉత్సాహంగా గ్రాడ్యుయేషన్ డే



విద్యార్థులతో వసీ ఉర్ రెహ్మాన్

చార్మినార్: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీసేందుకు విద్యాసంస్థలు కృషి చేయాలని డాన్ విద్యా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ వసీ ఉర్ రెహ్మాన్ అన్నారు. డాన్ హైస్కూల్‌లో మంగళవారం నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..విద్యార్థుల్లో ఆలోచనలను పెంపొందించి, నూతన ఆవిష్కరణల కోసం విద్యార్థులతో ప్రయోగాలు చేయించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉంటుందన్నారు. 2025–26 విద్యా సంవత్సరం నుంచి డాన్ విద్యా సంస్థకు చెందిన విద్యార్థులకు ఉచితంగా ఈ ఫౌండేషన్ కోర్సులను ప్రదానం చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఇదారే మీలియా చైర్మన్ రషీద్ అహ్మద్, అరిఫా ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

స్టాటిస్టికల్ రాష్ట్ర కమిటీ ఎన్నిక



డాక్టర్ రవీంద్ర నాయక్‌ను కలిసిన నూతన కమిటీ

సుల్తాన్‌బజార్: తెలంగాణ రాష్ట్ర స్టాటిస్టికల్ అసోసియేషన్ (మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్) నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా బీపీ.ఆనంద్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా కె.పీటర్సన్, కోశాధికారిగా కొంపల్లి మత్స్యగిరి, రాష్ట్ర లిజనింగ్ అధికారులు రాజ్‌కుమార్, కోటేశ్వరరావు మల్లికార్జునరావు సబిత వేణి మహేష్ సుల్తానా శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా డానియల్ సుకుమార్, శ్రీనివాస్‌కుమార్ ఎన్నికయ్యారు. వీరితో పాటు ఏడు జోన్ల ఇన్‌చార్జీలు, కార్యవర్గ సభ్యులు నియమితులయ్యారు. నూతనంగా ఎన్నికైన రాష్ట్ర కమిటీ డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ రవీందర్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కమిటీని డీహెచ్ సమక్షంలో ఘనంగా సన్మానించారు.

ఆరాధనోత్సవాలు ప్రారంభం

జియాగూడ: కార్వాన్‌లోని పంచముఖ బ్రహ్మ ఆలయంలో పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవాలు ప్రారంభమయ్యాయి. మంగళవారం ఉదయం కలష పూజ, గణపతి పూజ, అంకురార్పణ, ధ్వజారోహనం, వీరబ్రహ్మేంద్రస్వామి అష్టోత్తర శతనామవాలి సహిత పుష్పాంజలి ఘటించారు. మధ్యాహ్నం స్వామి వారి కల్యాణం, ప్రసాద వితరణ, అన్నదానం, రాత్రికి ఊరేగింపు ఆలయ పరిసరాల్లో కొనసాగింది. ఈ కార్యక్రమంలో హనుమాన్ స్ట్రీట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు నామని రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ ముత్యాల భాస్కర్, సలహాదారులు ఆర్.ప్రేమ్‌చారి, కోశాధికారి ఆర్.రమేష్ చారి, అనంత చారి, వినయ్‌కుమార్ పాల్గొన్నారు.



ఘనంగా అంతర్జాతీయ నృత్య దినోత్సవం



కళాకారులకు అవార్డులను అందజేస్తున్న ప్రొఫెసర్ నిత్యానందరావు

గన్‌ఫౌండ్రీ: అంతర్జాతీయ నృత్య దినోత్సవాన్ని పురస్కరించుకొని డ్యాన్స్ ఇండియా తెలంగాణ రాష్ట్ర అవార్డుల ప్రదానోత్సవం మంగళవారం కళాప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ నిత్యానందరావు మాట్లాడుతూ..తెలుగు విశ్వవిద్యాలయం నృత్య ప్రదర్శనలను ప్రోత్సహిస్తుందని, నృత్య ప్రదర్శనలకు హాల్ ఉచితంగా ఇస్తామని తెలిపారు. అనంతరం నృత్య, సంగీత ప్రపంచానికి విశేష సేవలందించిన పలువురికి డ్యాన్స్ అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పర్యాటక శాఖ జనరల్ మేనేజర్ సురేష్ రెడ్డి, ది డ్యాన్స్ ఇండియా మ్యాగజైన్ ఎడిటర్ విక్రమ్ కుమార్, అసిస్టెంట్ ఎడిటర్ ఎం.భారతి, సెలక్షన్ కమిటీ చైర్మన్ డాక్టర్ సజని వల్లభనేని పాల్గొన్నారు.

కార్వాన్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలి



బల్దియా కమిషనర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ బల్దియా కమిషనర్‌ను కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన బల్దియా కమిషనర్ ఆర్.వి కర్ణన్‌ను కలిశారు. ఈ సందర్భంగా కార్వాన్ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను ఆయనకు వివరించారు. దీంతో పాటు అభివృద్ధి పనుల కోసం తాను గతంలో ఇచ్చిన ప్రతిపాదనలను కూడా మంజూరు చేయాలని కోరారు. వరద ముంపు నివారించడానికి నియోజకవర్గంలో జరుగుతున్న ప్రాజెక్టు పనులు ఇంకా పూర్తి కాలేదని ఆయన కమిషనర్ దృష్టికి తెచ్చారు. మరో వైపు రోడ్ల అభివృద్ధి పనులు కూడా ముందుకుసాగడం లేదని ఆయన పేర్కొన్నారు. కాగా సంబంధిత జోనల్ కమిషనర్‌తో పాటు ఇంజినీరింగ్ విభాగం అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకుంటానని కమిషనర్ ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు.



చిన్నారులతో తలసాని శ్రీనివాస్ యాదవ్ తదితరులు

వార్షికోత్సవం

గన్‌ఫౌండ్రీ: ప్రపంచ దేశాలు మన సంస్కృతి, ఆచారాలను అనుసరించడం తెలుగువారందరికీ ఎంతో గర్వకారణమని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో శ్రీ గీతిక కూచిపూడి ఆర్ట్స్ అకాడమీ 27వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పిల్లలను ఖాళీ సమయాలలో సెల్‌ఫోన్లు, టీవీలకు ఆకర్షితులు కాకుండా వివిధ రంగాల్లో రాణించే విధంగా శిక్షణ ఇప్పించాలని సూచించారు. బాల్యం నుంచే తమ పిల్లలు క్రమశిక్షణతో సన్మార్గంలో నడిచేలా తల్లిదండ్రులు పర్యవేక్షించాలని కోరారు. అంతకు ముందు వివిధ అంశాలపై సంస్థ చిన్నారుల కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ శేషకుమారి, నిర్వాహకులు లక్ష్మీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు రూ.21 లక్షల నిధులు మంజూరు

చాంద్రాయణగుట్ట: లాల్‌దర్వాజా గణేష్‌నగర్‌లో డ్రైనేజీ పైప్‌లైన్, సీసీ రోడ్డు నిర్మాణం జీహెచ్ఎంసీ ప్రత్యేక నిధుల నుంచి రూ.21 లక్షలు మంజూరు అయ్యాయని టీపీసీసీ కార్యనిర్వాహక కార్యదర్శి పర్వతాల రాజేందర్ తెలిపారు. గణేష్ నగర్‌లో నెలకొన్న సమస్యలను జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లిన వెంటనే నిధులు మంజూరు చేశారన్నారు. జంగమ్మెట్ డివిజన్‌లో ఎప్పటికప్పుడు అభివృద్ధి పనులు చేయిస్తున్నామన్నారు. కాంగ్రెస్ హయాంలోనే పాతబస్తీ అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన తెలిపారు.

కుల గణన కాంగ్రెస్‌కే సాధ్యం

గోల్కొండ: కుల గణన కాంగ్రెస్‌కే సాధ్యమని కాంగ్రెస్ కార్వాన్ సీనియర్ నాయకుడు కురాకుల కృష్ణ అన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న తెలంగాణలో కుల గణనను పూర్తి చేసిన సీఎం రేవంత్‌రెడ్డి ఇతర రాష్ట్రాలకే కాకుండా కేంద్ర ప్రభుత్వానికి కూడా సవాల్ విసిరారని ఆయన అన్నారు. కాంగ్రెస్‌కు భయపడే కేంద్ర ప్రభుత్వం జన గణనతో పాటు కుల గణన చేయడానికి సిద్ధంపడిందన్నారు. భారత్ జోడో యాత్రలో రాహుల్‌గాంధీ పేద, బడుగు, బలహీన వర్గాల కుటుంబాలను కలిశారని ఆ సమయంలోనే కుల గణనపై స్పష్టమైన నిర్ణయానికి వచ్చారన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

శాలిబండ: శాలిబండ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో తాగునీటి సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. డివిజన్‌లోని శాలిబండ, ఖాజీపురా, షక్కర్‌గంజ్, హిమ్మత్‌పురా తదితర ప్రాంతాల్లో రోజు విడిచి రోజు సరఫరా అయ్యే తాగునీరు కాస్తా.. వారం రోజులకొసారి కూడా సరఫరా జరగడం లేదని వాపోయారు. దీంతో ప్రజలు ప్రైవేటు ట్యాంకర్లపై ఆధారపడాల్సిన దుస్థితి ఏర్పడిందంటున్నారు. అసలే ఎండ కాలంపై ఆపై తాగునీటి సరఫరా లేకపోవడంతో తాము పడరాని పాట్లు పడాల్సి వస్తుందని బస్తీల ప్రజలు వాపోతున్నారు. దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించి నీటి సరఫరాలో లోపాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రతిరోజూ కాకుండా నాలుగు రోజులైనా నీటి సరఫరా చేయాలని జలమండలి అధికారులను కోరుతున్నారు.

యువకుడి అదృశ్యం



తేజ శంకర్

నాంపల్లి: హాస్టల్‌లో ఉంటున్న ఓ యువకుడు అదృశ్యమైన ఘటన మాసబ్‌ట్యాంక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన పున్నమ్ బి.వి.ఎం మాణిక్యాలరావు కుమారుడు పున్నమ్ తేజ శంకర్ (25) చదువు కోసం మాసబ్‌ట్యాంక్‌లోని మహావీర్ ఆసుపత్రికి పక్కన ఉండే జీఆర్‌కే బాయ్స్ హాస్టల్‌లో ఉంటున్నారు. ఈ నెల 4న హాస్టల్ నుంచి బయటకు వెళ్లిన తేజ శంకర్ తిరిగి హాస్టల్‌కు రాలేదు. హాస్టల్ యాజమాన్యం కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. బంధువులు అన్ని ప్రాంతాల్లో విచారించినా ఎక్కడా కనిపించలేదు. దీంతో మియాపూర్ ఎక్స్ రోడ్‌లోని ఓ ప్రైవేట్ హాస్టల్‌లో నివాసం ఉంటూ ఖాజీపల్లి హెటిరో ల్యాబ్స్‌లో పనిచేసే సోదరుడు పవన్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ సమస్యలు లేకుండా చర్యలు



మంచిరేవుల భూమి సర్వేలో పాల్గొన్న విద్యుత్, రెవెన్యూ అధికారులు

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో కొత్తగా వస్తున్న గేటెడ్ కమ్యూనిటీలు, టవర్‌లు, నివాసాలకు అనుగుణంగా విద్యుత్ సబ్‌స్టేషన్‌లను పెంచి రాబోయే రోజుల్లో సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ఇబ్రహింబాగ్ ఏడీఈ అంబేడ్కర్ అన్నారు. మంచిరేవుల రెవెన్యూ పరిధిలోని సర్వేనంబర్ 283లోని ఎకరం భూమిని ప్రభుత్వం విద్యుత్ సబ్‌స్టేషన్ గురించి ఇటీవల కేటాయించారు. దీంతో మంగళవారం దాన్ని సర్వే, పంచనామ నిర్వహించి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సురేష్ విద్యుత్ అధికారులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఏడీఈ మాట్లాడుతూ..నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో వస్తున్న నిర్మాణాలకు అనుగుణంగా మరో నాలుగు సబ్‌స్టేషన్‌ల ఏర్పాటు ఎంతో అవసరమన్నారు. అందుకు అనుగుణంగా పలు చోట్ల స్థలాలను కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరామన్నారు. వాటిని కేటాయిస్తే రాబోయే 20 ఏళ్ల వరకు విద్యుత్ సమస్యలు లేకుండా సబ్‌స్టేషన్‌లను నిర్మిస్తామన్నారు. మంచిరేవుల సబ్‌స్టేషన్ నిర్మాణానికి రూ.కోట్ల నిధులు మంజూరయ్యాయని, త్వరలోనే పనులను మొదలుపెడతామన్నారు. రెవెన్యూ, విద్యుత్ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన ‘అన్నమయ్య శబ్ద తరంగవల్లి’



ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

గన్‌ఫౌండ్రీ: నేటి తరం చిన్నారులకు పాఠశాల స్థాయి నుంచే శాస్త్రీయ సంగీత కళలపై మక్కువ కల్పించాలని పలువురు వక్తలు అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో శ్రీచక్ర మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ‘అన్నమయ్య శబ్ద తరంగవల్లి’ పేరిట నిర్వహించిన సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. నృత్య గురువు డాక్టర్ నళిని రమణ శిష్యబృందం చేసిన నృత్య ప్రదర్శనలు అలరించాయి. ఈ సందర్భంగా సాంస్కృతిక శాఖ కమిటీ సభ్యులు పాలం శెట్టి సురేష్ మాట్లాడుతూ..శాస్త్రీయ సంగీత వారసత్వ నృత్యాలను భవిష్యత్ తరాలకు అందించడంలో సాంస్కృతిక సంస్థల పాత్ర ఎంతో కీలకమన్నారు. అనంతరం పలువురు కళాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్వీఏఎస్టీ అన్నమయ్య సేవా డైరెక్టర్ మీనాక్షి శ్రీనివాస్, అకాడమి ప్రతినిధులు పాల్గొన్నారు.

సైబర్ సెక్యూరిటీపై అవగాహన అవసరం



అబిడ్స్: సైబర్ సెక్యూరిటీపై విద్యార్థినులకు అవగాహన అవసరమని స్ఫూర్తి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఎస్ గిరిధర్ ఆకుల పేర్కొన్నారు. మహిళా సాధికారత కార్యశాల సైబర్ సెక్యూరిటీ అనే అంశంపై విద్యార్థినులకు టీసీఎస్ కంపెనీ నుంచి అవగాహన కల్పించామన్నారు. అవగాహన పొందిన వారందరికీ మంగళవారం సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం గిరిధర్ ఆకుల మాట్లాడుతూ..కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన భేటీ బచావో–భేటీ పడావో కార్యక్రమానికి అనుకూలంగా తమ కళాశాలలో సైబర్ సెక్యూరిటీపై విద్యార్థినులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి, కరస్పాండెంట్ ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, ఐసీటీ సమన్వయ కర్త గోపాల్‌రెడ్డి, వీణ, మాధవీ, మమత, శ్రీవాణి, వజిదాభేగం, డాక్టర్ లక్ష్మీకాంత్, దినేష్ పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం



తాళ్లగడ్డలో ఆటో, ఆటో ట్రాలీపై కూలిన చెట్టు



ఆసిఫ్‌నగర్‌లో రోడ్డుకు అడ్డంగా విరిగిపడ్డ విద్యుత్ స్తంభం, చెట్టు

గోల్కొండ: సోమవారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. తాళ్లగడ్డ, గుడిమల్కాపూర్ తదితర ప్రాంతాల్లో భారీ చెట్లు నెలకూలాయి. తాళ్లగడ్డ దాదావాడి జైయిన్ మందిర్ వద్ద ఓ పెద్ద చెట్టు ఓ ఆటోపై కూలింది. దీంతో ఆటో పూర్తిగా ధ్వంసమైంది. గుడిమల్కాపూర్ కబడ్డీ స్టేడియం వద్ద రెండు చెట్లు కూలాయి. ఈ విధంగా కూలిన చెట్ల కింద ఓ ఆటో ట్రాలీ, ఒక ఆటో పూర్తిగా ధ్వంసమయ్యాయి. కాగా చెట్లు కూలడంతో బీజేపీ నాయకుడు జొన్నకుంటి మధుసుధన్, సునీల్ యాదవ్ డీఆర్ఎఫ్ సిబ్బందికి ఫోన్ చేశారు. అర్ధరాత్రి వరకు డీఆర్ఎఫ్ సిబ్బంది శ్రమించి రోడ్డుకు అడ్డంగా కూలిన చెట్లను తొలగించారు.

నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు..

విజయనగర్‌కాలనీ: ఈదురుగాలులతో కురిసిన భారీ వర్షానికి పలుచోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగి పడడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. విజయనగర్‌కాలనీ, మురాద్‌నగర్, ఆసిఫ్ నగర్, మాసబ్‌ట్యాంక్ జేబాబాగ్, తదితర ప్రాంతాల్లో గాలివానకు రోడ్డుకు అడ్డంగా చెట్లు విరిగి పడ్డాయి. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగి పడడంతో స్థానికంగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. మంగళవారం మధ్యాహ్నం వరకు కూడా ఆసిఫ్‌నగర్‌లో విరిగిపడ్డ విద్యుత్ స్తంభానికి మరమ్మతులు చేయకపోవడంతో విద్యుత్ శాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

అక్రమంగా నివసిస్తున్న పాకిస్తానీయులను బహిష్కరించాలి



తహసీల్దార్ మన్నె ప్రేమ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గోపాల్‌జీ, ప్రేమ్‌సింగ్ రాథోడ్



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉమా మహేందర్

అబిడ్స్: నగరంలో అక్రమంగా నివసిస్తున్న పాకిస్తానీయులను బహిష్కరించాలని రాష్ట్ర బీజేపీ కార్యాలయ కో ఆర్డినేటర్ డి.గోపాల్‌జీ, మాజీ ఎమ్మెల్యే ప్రేమ్‌సింగ్ రాథోడ్ డిమాండ్ చేశారు. మంగళవారం నాంపల్లి మండల తహసీల్దార్ మన్నె ప్రేమ్‌కుమార్‌కు వినతపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఉగ్రవాదులను ప్రోత్సహించిన పాకిస్తానీయులను తక్షణమే బహిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో గోషామహల్ నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ కృష్ణ, బీజేపీ నేతలు పాండుయాదవ్, శ్రీకాంత్, శంకర్, దాసరి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

చార్మినార్: పాతబస్తీలో తిష్ట వేసిన పాకిస్తాన్ అక్రమ వలసదారులను వెంటనే గుర్తించి వెనక్కి పంపించాలని బీజేపీ గోల్కొండ జిల్లా అధ్యక్షుడు టీ. ఉమామహేందర్ డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులతో కలిసి ఆయన సోమవారం బహదూర్‌పురా తహసీల్దార్‌కు రాతపూర్వక ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఏళ్ల తరబడి పాతబస్తీలో నివసిస్తున్న పాకిస్తానీయులను తరిమేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు అట్లూరి రామకృష్ణ, ప్రవీణ్ కుమార్, సురేందర్, నరేందర్, ప్రకాష్ గౌడ్, బల్వీర్ సింగ్, రంజిత్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

యాకుత్‌పురా: హైదరాబాద్‌లో ఉన్న పాకిస్తానీలు, రోహ్యింగాలను ప్రభుత్వం వెంటనే పంపించాలని బీజేపీ హైదరాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ కామాటి మహేశ్వర్ డిమాండ్ చేశారు. మంగళవారం యాకుత్‌పురాలో ఆయన మాట్లాడుతూ..నగరంతో పాటు పాతబస్తీలో అక్రమంగా ఉంటున్న పాకిస్తాన్ దేశస్తులను పోలీసులు గుర్తించి తక్షణమే పంపించాలన్నారు. అమాయక హిందువులను హతమార్చిన పాకిస్తాన్ ఉగ్రవాదులను భారత సైన్యం కఠినంగా శిక్షించి మృతుల ఆత్మకు శాంతి చేకుర్చాలన్నారు.